క్లుప్తంగా

విద్యుత్ ఏఈ సాంబశివరావుకు సన్మానం



మైలవరం: మూడు జిల్లాల ఉత్తమ సెక్షన్ అధికారిగా మైలవరం విద్యుత్ ఏఈ పర్వతనేని సాంబశివరావు రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం విద్యుత్ ఉద్యోగులు ఆయనను ఘనంగా సన్మానించారు. సాంబశివరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఆపరేటర్ల కృషి ఫలితంగానే తనకు అవార్డు లభించిందన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ జె. అనిల్‌కుమార్, లైన్‌మెన్స్ రాంబాబు, సుందర్ సింగ్, గణపతిరెడ్డి, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురికి సీఎం సహాయనిధి మంజూరు

మైలవరం: మైలవరం నియోజకవర్గానికి చెందిన ఆరుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.6.50 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ చొరవతో నియోజకవర్గంలోని ఆరుగురికి ఈ మొత్తం మంజూరైనట్లు చెప్పారు. గుంటుపల్లికి చెందిన లేళ్ల లక్ష్మీలతకు రూ.1,20,000, గణపవరం గ్రామానికి చెందిన ఉయ్యూరు నాగిరెడ్డికి రూ.1,80,000, వెల్వడం గ్రామానికి చెందిన గూడూరు నారాయణమ్మకు రూ.1,40,000, రెడ్డిగూడెంకు చెందిన బొల్లారెడ్డి సత్యవాణికి రూ. 70,000, చిలుకూరి రామిరెడ్డికి రూ.65,000, ఇబ్రహీంపట్నానికి చెందిన అక్కల నాగేంద్ర ప్రసాద్‌కు రూ.75,000 మంజూరయ్యాయని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది. లబ్ధిదారులకు ఆయా గ్రామాల్లోని వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా చెక్కులు అందజేస్తారన్నారు.

నేడు జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

తిరువూరు: స్థానిక షిర్డీ సాయి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తామని ఫిట్ జోన్ ఆర్గనైజర్ వి. మల్లేశ్వరరావు తెలిపారు. స్త్రీ, పురుషులకు వేర్వేరుగా ఈ పోటీలు జరుగుతాయని, పాల్గొనదలచినవారు సెల్: 99854 22567 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శరవేగంగా కులగణన

ఆగిరిపల్లి: మండలంలో కులగణన సర్వే శరవేగంగా సాగుతోంది. గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. ఆగిరిపల్లి కొత్త మసీదు రోడ్డులో సర్వేను ఎంపీడీఓ శంకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కులగణన సర్వే నిర్వహిస్తోందన్నారు. మండలంలో ఇప్పటివరకు 80 శాతం సర్వే పూర్తయిందని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి బొల్లినేని ప్రసాద్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- వైఎస్సార్ సీపీ తిరువూరు ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు
- అక్కచెల్లెమ్మలకు ఆసరా చెక్కు అందజేత



గంపలగూడెంలో ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న స్వామిదాసు, ప్రజాప్రతినిధులు

గంపలగూడెం: మహిళాభ్యున్నతే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన చేస్తోందని వైఎస్సార్ సీపీ తిరువూరు ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కు పంపిణీని గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి అవసరమైన పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారని చెప్పారు. కరోనా కష్టకాలంలో సైతం నిరాటంకంగా సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. తన పాలనలో జగనన్న మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించారని చెప్పారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రం అన్ని రంగాల్లో మరింతగా ముందుకు సాగాలంటే రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్ సీపీని బలపరిచి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అందజేస్తున్న ఆసరా నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో జగనన్న మహిళలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఆసరా నగదు నూరుశాతం విడుదల చేశారని తెలిపారు. గంపలగూడెం మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగో విడత 1,614 స్వయం సహాయక సంఘాలకు రూ. 13.18 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు. డ్వాక్రా రుణాల మాఫీలో భాగంగా అసరా పథకంలో ఒక్క గంపలగూడెం మండలానికే నాలుగు విడతల్లో మొత్తం రూ. 52.72 కోట్లు రద్దు చేశారన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నల్లగట్ల సుధారాణి, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, పట్టణ శాఖ అధ్యక్షుడు కొత్తగుండ్ల నరసింహారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కావూరి వినయ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యుడు చెరుకు నరసారెడ్డి, గోగులమూడి చెన్నకేశవరెడ్డి, ఆలపాటి ఉమామహేశ్వరరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కోట దాసు, ఎంపీడీఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐడీ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్

నూజివీడు: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై సంబంధిత వర్గాలకు చెందిన విద్యార్థులు, యువకులు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని సీఐడీ విజయవాడ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆవరణలో యువతకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌పై సీఐడీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సామాజికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారిపై అఘాయిత్యాలు, ద్వేషపూరిత నేరాలను నిరోధించేందుకు 1989లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టంలో ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు సవరణలను సైతం తీసుకువచ్చాయని చెప్పారు. చట్టాలను దుర్వినియోగం చేయకుండా ప్రజలే కాపాడుకోవాలన్నారు. పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి, రూరల్ సీఐ బాల సురేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐడీ ఎస్ఐ బాలాజీరావు, ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసరావు, దళిత నాయకులు నత్తా నాగేశ్వరరావు, ఉదయగిరి కృపారావు, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సాగునీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలి

పుట్రేల (విస్సన్నపేట): చెరువు ఆయకట్టు రైతులు పంట సాగుకు నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దోర్నాల దామోదరరెడ్డి అన్నారు. పుట్రేల గ్రామంలో గాజుల చెరువు ఆయకట్టు రైతులకు ఆంధ్రప్రదేశ్ సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తన పథకంలో భాగంగా పంట-నీరు ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. నీటి వినియోగం, పంటల సాగుపై అవగాహన కల్పించారు. సర్పంచ్ కారుమంచి స్వాతి, సొసైటీ అధ్యక్షుడు బి. సూర్యనారాయణరెడ్డి, జిల్లా భూగర్భ జల శాఖా ధికారి హరీష్, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

252 మందికి వైద్య సేవలు

పెనుగొలను(గంపలగూడెం): జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2లో భాగంగా గంపలగూడెం మండలం పెనుగొలనులో శనివారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శశిప్రియ, తరుణ్, ఆప్తమాలజిస్ట్ ప్రవీణ్, గైనకాలజిస్ట్ 252 మంది రోగులను పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రోగులకు అవసరమైన మందులు పంపిణీని సర్పంచ్ సంగెపు లలిత ప్రారంభించారు.

క్షీరబంధు చెక్కు అందజేత

రెడ్డిగూడెం: కొత్తరెడ్డిగూడెం పాల ఉత్పత్తిదారుల సంఘ సభ్యుడు చిన్ని రాంబాబు ఇటీవల మృతిచెందాడు. క్షీరబంధు పథకం ద్వారా మంజూరైన రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని చిన్ని రాంబాబు భార్య చిన్ని జయలక్ష్మికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో కృష్ణా మిల్క్ యూనియన్ అధ్యక్షుడు అంజిరెడ్డి, మేనేజర్ తుమ్మల యశ్వంత్, పాలకవర్గ సభ్యులు, సూపర్‌వైజర్ ఎం. రాంబాబు, వేతన కార్యదర్శి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సీనియర్ సిటిజన్స్ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం కొండపల్లిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎన్టీటీపీఎస్ ఏపీ జెన్‌కో శిక్షణా కేంద్రం చీఫ్ ఇంజినీర్ నాగభూషణం మాట్లాడుతూ సంస్థ సామాజిక సేవలను కొనియాడారు. సంస్థ అధ్యక్షుడు కేవీ సత్యనారాయణ, కార్యదర్శి ఆచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: జాతీయ స్థాయి క్యాట్ నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్టు ఒలింపియాడ్ లెవెల్ 2లో తమ పాఠశాల విద్యార్థులు పలు బహుమతులు సాధించారని తిరువూరు శ్రీ చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ ఇబ్రహీం తెలిపారు. 99 మంది విద్యార్థులు ఈ పరీక్షలో ఉత్తీర్ణులు కాగా, నలుగురికి నగదు బహుమతులు, 29 మందికి మెడల్స్, 66 మందికి సర్టిఫికెట్లు లభించాయని చెప్పారు. పాఠశాల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ నరేంద్ర, అకడమిక్ డీన్ రామకృష్ణ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

సమస్య పరిష్కరించాలని వినతి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ నుంచి బూడిద చెరువుకు వెళ్లాల్సిన బూడిద పైపుల క్లిప్‌లను గుర్తుతెలియని వ్యక్తులు లూజు చేశారు. లీకేజీల ద్వారా వెలువడే బూడిద నీరు కాలువల ద్వారా పంపింగ్ స్కీమ్‌కు చేరడంతో ఫిల్టర్‌బెడ్‌లు బ్లాక్ అయి తాగునీటి ఎద్దడి నెలకొంది. శనివారం తాగునీటి సమస్యపై ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నవీన్ గౌతమ్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు కలిసి సమస్యను వివరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అంజేశారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల విజేతలు వీరే



నూజివీడు నియోజకవర్గ స్థాయి వాలీబాల్ విజేత ఆగిరిపల్లి జట్టు

నూజివీడు: ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీల్లో పలు విభాగాల్లో విజేత జట్ల వివరాలను శనివారం ప్రకటించారు. పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాలలో పలు విభాగాల్లో ఈనెల 24 నుంచి పోటీలు నిర్వహించగా ఎంపీడీఓ వీపీ విజయ్ కుమార్ పర్యవేక్షించారు. పురుషుల విభాగంలో కబడ్డీలో నూజివీడు, చాట్రాయి, వాలీబాల్‌లో ఆగిరిపల్లి, నూజివీడు, షటిల్‌లో చాట్రాయి, ఆగిరిపల్లి, ఖోఖోలో ముసునూరు, ఆగిరిపల్లి ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. మహిళల విభాగంలో కబడ్డీలో చాట్రాయి, ఆగిరిపల్లి, ఖోఖోలో చాట్రాయి, నూజివీడు, వాలీబాల్‌లో ముసునూరు, నూజివీడు, షటిల్‌లో ముసునూరు, నూజివీడు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నాయి. నియోజకవర్గస్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోలలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.35 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.15 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేలు, షటిల్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5 వేల చొప్పున నగదు బహుమతిని అందజేయనున్నారు. పీడీలు రవీంద్ర, ఆలీఖాన్, వనజ, ఆరతి, స్వప్న, సరళ, రాణి, నాగేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు పోటీలను నిర్వహించారు.

ప్రైవేట్ విద్యుత్ కార్మికుల ర్యాలీ



మైలవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అసోసియేషన్ సభ్యులు

మైలవరం: మైలవరం నియోజకవర్గ స్థాయిలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్, మైక్ అండ్ లైటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా జనవరి 27న ఎలక్ట్రీషియన్ డేగా నిర్వహిస్తారని నాయకులు తెలిపారు. తొలుత యూనియన్ జెండాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్‌కే బాషా, ముత్తంశెట్టి రామారావు, పెదబాబు, ఎస్‌కే సలీం, మైక్ బాబూరావు, చల్లా అంకరాజు, బ్రహ్మం, చింతలపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు పురస్కారం



కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న గంధం పుల్లయ్య, శ్రీనివాసరావు, జాన్సన్ దేవరాజ్, శ్యామల, జగదీష్, కృష్ణ

తిరువూరు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు నుంచి పలువురు అధికారులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఆర్డీఓ మాధవి, నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, తిరువూరు పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పద్మారావు, కానిస్టేబుల్ శ్రీనివాసరావు, విద్యుత్ లైన్‌మెన్ కాశేశ్వరరావు, ఎస్ఎస్‌పీ ఏఈ శ్రీలక్ష్మి, తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గంధం పుల్లయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ సత్యవతి ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

విస్సన్నపేట మండలంలో నలుగురికి..

విస్సన్నపేట: గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలో నలుగురు ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలను జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా అందుకున్నారు. స్థానిక గిరిజన గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్, గిరిజన గురుకుల జిల్లా కన్వీనర్ జి. జాన్సన్ దేవరాజ్, సాంఘిక సంక్షేమ శాఖ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల నరసాపురం ప్రిన్సిపాల్ ఎంబీడీ శ్యామల, మండల పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ జి. జగదీష్, కలగర సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్ డి. కృష్ణా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు.

బాలోత్సవం నిర్వహణపై సన్నాహక సమావేశం

తిరువూరు: తిరువూరులో బాలోత్సవం నిర్వహణపై సన్నాహక సమావేశం స్థానిక సుందరయ్య భవన్‌లో శనివారం జరిగింది. అమరావతి బాలోత్సవం అధ్యక్షుడు రామరాజు మాట్లాడుతూ ఉత్సవం నిర్వహణకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడం, వారి అభిరుచులు, ఆసక్తికి అనుగుణంగా ఉత్సవం నిర్వహించాలన్నదే లక్ష్యమన్నారు. తిరువూరు బాలోత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం. హరికృష్ణ, సభ్యులు గంగాధర్, పాపారావు, అపర్ణ, భరతకుమారి, రాంప్రదీప్, వెంకటరత్నం పాల్గొన్నారు.

షిర్డీలో మైలవరం కోలాట బృందం ప్రదర్శన

మైలవరం: షిర్డీలోని సాయిబాబా సన్నిధిలో మైలవరం కోలాట బృందం గత రాత్రి ఇచ్చిన కోలాట ప్రదర్శన పలువురిని ఆకట్టుకుందని నిర్వాహకులు వి. బాలాజీ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో తిరుమల తదితర పుణ్య క్షేత్రాల్లో ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్ర స్థాయి పోటీల్లో తృతీయ స్థానం పొందిందన్నారు. షిర్డీ సంస్థాన్ వారితో పాటు వందలాది మంది ప్రేక్షకులు వీక్షించి కోలాట బృందాన్ని అభినందించారన్నారు. కోలాట గురువు కవితతో పాటు 30 మంది సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

నూజివీడు: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని నూజివీడు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి. నాగమురళి అన్నారు. పట్టణంలోని ఆర్టీఏ కార్యాలయంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం పలు డ్రైవింగ్ స్కూళ్ల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడి ఎంతోమంది యువకులు ప్రాణాలు కోల్పోతున్నారని, దీని వల్ల జన్మనిచ్చిన తల్లిదండ్రులకు కడుపుకోతను మిగుల్చుతున్నారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని చెప్పారు. కారులో వెళ్లేటప్పుడు సీటు బెల్టు పెట్టుకోవడం, ద్విచక్ర వాహనంపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం, అతి వేగంగా నడపకుండా ఉండటం వంటివి ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ డైరెక్టర్ వాసు, బెస్ట్ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపాల్ జమలయ్య, రవాణా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

నూజివీడు: 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఏపీఈఆర్‌సీ ఆధ్వర్యంలో డిస్కమ్స్ వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈనెల 29 నుంచి 31 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తామని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ. సత్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని ఈఈ కార్యాలయం వద్ద ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయాన్ని తెలియజేయవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ విలువైన అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ వాసు

ముసునూరు: మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఎస్ఐ పి.వాసు అన్నారు. శనివారం సాయంత్రం ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మంచి పోలీసింగ్ ద్వారా శాంతి, భద్రతలను పరిరక్షిస్తామన్నారు. అక్రమ సారా, మద్యం విక్రయాలు, కోడి పందేలు, జూద శిబిరాలను అరికట్టడం ద్వారా పేద యువకులు వ్యసనాల బారిన పడకుండా నివారిస్తానని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావు దంపతులు, జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, నాయకులు ఎస్ఐకి అభినందనలు తెలిపారు.

పాఠశాలకు బీరువా వితరణ

కాకర్ల(తిరువూరురూరల్): కాకర్ల ఎంపీయూపీ స్కూల్‌కు గ్రామానికి చెందిన రత్నారావు, సత్యవతి ఇనుప బీరువా, టేబుల్ వితరణ ఇచ్చారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సగ్గుర్తి రంగయ్య, మంగతాయారమ్మల జ్ఞాపకార్థం వారి కుమార్తె, అల్లుడు వీటిని అందజేశారని ప్రధానోపాధ్యాయుడు పి. వెంకటస్వామి తెలిపారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కడింపోతవరంలో పాఠశాలను ఏర్పాటు చేయండి

జి.కొండూరు: పినపాక శివారు కడింపోతవరం గ్రామ పరిధిలోని క్వారీలు, క్రషర్‌లలో పనిచేసేందుకు వచ్చిన వలస కార్మికుల పిల్లలకు పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ కోరారు. మచిలీపట్నం, జిల్లా పరిషత్ కార్యాయంలో శనివారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జి.కొండూరు ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కందులపాడు, హెచ్ ముత్యాలంపాడు గ్రామాల నడుమ బుడమేరు వాగుపై శాశ్వత వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో పాటు జి.కొండూరు నుంచి గంగినేని వరకు నిలిచిపోయిన రహదారి అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు.

ఎంపీ కేశినేని నానిని కలిసిన కౌన్సిలర్లు



విజయవాడస్పోర్ట్స్/కొండపల్లి(ఇబ్రహీంపట్నం) : విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)ని కొండపల్లి మున్సిపాల్టీ వార్డు కౌన్సిలర్లు, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ నాయకులు, తిరువూరు నియోజకవర్గ మైనార్టీ నాయకులు, వైఎస్సార్ సీపీ న్యాయవాదులు విజయవాడ కేశినేని భవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఎంపీగా గ్రామాల్లో చేసిన అభివృద్ధి, మైలవరంలో వైఎస్సార్ సీపీ పటిష్టతపై కొద్దిసేపు చర్చించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని ఎంపీ వారికి సూచించారు. కౌన్సిలర్లు గుంజా శ్రీనివాస్, నాగరాజకుమారి, మొగిలి దయా, అడపా వెంకయ్యనాయుడు, ఎంఏ బేగ్, కుమ్మరి శ్రీను, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

గంపలగూడెం: వైఎస్సార్ సీపీ గంపలగూడెం మండల కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు. గంపలగూడెం వినగడప రోడ్డులోని ముత్యాలమ్మ గుడి ఎదురుగా మామిడి యార్డులో జరిగే సమావేశానికి రాజ్యసభ సభ్యులు అయోధ్య రామిరెడ్డి, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేశినేని శ్రీనివాస్ (నాని), తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లగట్ల స్వామిదాసు విచ్చేస్తారన్నారు. పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువకుడికి అభినందన

తిరువూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో పోటీ పరీక్షల మెటీరియల్ చదివి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించిన యువకుడిని శనివారం గ్రంథాలయాధికారి, పాఠకులు ఘనంగా సన్మానించారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకున్నా ఉద్యోగం సాధించలేని ప్రస్తుత పరిస్థితిలో జిల్లా గ్రంథాలయ సంస్థ సరఫరా చేసిన పోటీ పరీక్షల మెటీరియల్‌ను చదివి స్టాఫ్ సెలక్షన్ కమిషన్ మల్టీటాస్కింగ్ స్టాఫ్ రాత పరీక్షలో విజయం సాధించడం అభినందనీయమన్నారు. తాను కేంద్ర ప్రభుత్వంలోని సెంట్రల్ వాటర్ కమిషన్‌లో ఎంటీఎస్ ఉద్యోగం సాధించేందుకు గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడిందని వసంతకుమార్ వివరించారు.

ఉత్కంఠగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

తిరువూరు: తిరువూరు నియోజకవర్గ స్థాయిలో శనివారం ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. విస్సన్నపేట, తిరువూరు జట్ల మధ్య జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తిరువూరు ఆరో వార్డు సచివాలయ జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. షటిల్ క్రీడాకారులు వేల్పుల భరత్‌కుమార్, బాజీలను కోచ్ బొర్రా శ్రీను, నేషనల్ రిఫరీ భరత్ తదితరులు అభినందించారు.